క్లుప్తంగా

ఎస్‌ఐగా ప్రమోషన్‌పై వెళ్తున్న ఏఎస్‌ఐకి సన్మానం

నాగులుప్పలపాడు: మండల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎస్‌ఐగా బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లును స్టేషన్ ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఎస్‌ఐగా బాపట్ల జిల్లాకు బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లు అక్కడ కూడా మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

రోగులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

చీమకుర్తి: ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం చీమకుర్తిలో బీజేపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. చీమకుర్తిలోని ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి బీజేపీ అధికారం చేపట్టిన సందర్భంగా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీ శంకర్, గుండా శ్రీనివాసరావు, పాత్రుని నాగార్జున, శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

వర్షాలతో పదునెక్కిన భూములు

కొత్తపట్నం: మండలంలో అన్ని గ్రామాల్లో మూడు రోజులపాటు కురిసిన వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ, చామదుంప, కూరకాయల పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. కొంత మంది రైతులు వేరుశనగ విత్తనం వేయడానికి పొలం సిద్ధం చేసుకుంటున్నారు. రొయ్యల చెరువుల్లో ఉప్పు శాతం తగ్గి రొయ్యలు ఆరోగ్యంగా ఉన్నాయి. కొందరు రైతులు రొయ్య పిల్లలు వేయటానికి పంపింగ్ చేస్తున్నారు. ఈ వర్షం వల్ల ఉప్పు రైతులకు స్వల్ప నష్టం జరిగింది. మడిలో వర్షం నీరు చేరి ఉప్పు కరిగింది. పది రోజులపాటు వచ్చే ఉప్పు దిగుబడి ఆగిపోయింది. వర్షం పడక పోతే ఉప్పు వచ్చే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

620 మందికి కంటి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న కంటి వైద్యనిపుణులు అరుణ్‌చంద్ర

ముండ్లమూరు: మండలం కేంద్రమైన ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉన్నం చారిటబుల్ ట్రస్టు, జిల్లా అంధత్వ నివారణా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 620 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు క్యాంపు ఇన్‌చార్జ్ నాగబాబు తెలిపారు. కంటి వైద్య నిపుణులు అరుణ్‌చంద్ర, చేతనలక్ష్మి శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 364 మందికి శస్త్ర చికిత్సల కోసం రిఫర్ చేశారు. ఉన్నం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఉన్నం రామాంజనేయులు, నరసింహారావు, రాములు కంటి వైద్య శిబిరానికి హాజరైన వారికి అన్ని వసతులు ఏర్పాటు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సాగర తీరంలో సండే సందడి



సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. వేసవి సెలవులు ముగియనుండటంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివారం కొత్తపట్నం సముద్ర తీరానికి సందర్శకులు పోటెత్తారు. బీచ్‌లో యువకులు, చిన్నారులు, మహిళలు కేరింతలు కొడుతూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఉదయం సముద్రం ఉధృతంగా ఉండటం, గంట సేపు స్వల్ప వర్షం కురిసినా, మధ్యాహ్నం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో సందర్శకులు సంతోషంగా గడిపారు. బీచ్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మెరైన్ పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టారు.
– కొత్తపట్నం

బంగారు పంటలు పండుతాయ్!


కొచ్చెర్లకోట వద్ద పారుతున్న గుండ్లకమ్మ


చందవరం వద్ద పారుతున్న గుండ్లకమ్మ

- గుండ్లకమ్మకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుతో సమస్యలన్నింటికీ పరిష్కారం


దొనకొండ: గుండ్లకమ్మ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అనివార్యమైంది. ఇలా చెరువులకు నీరందిస్తే బీడు పొలాలు సస్యశ్యామలంగా మారి పంటలు పండుతాయి. రైతులు, కూలీలకు చేతినిండా పని.. ప్లేటు నిండా భోజనం దొరుకుతాయి. కొచ్చెర్లకోట పంచాయతీ, రామాపురం, చందవరం పంచాయతీ పరిధిలో సెలయేరులా ప్రవహించే నీరు వృథా కాకుండా గుండ్లకమ్మకు లిఫ్ట్ ఇరిగేషన్ చేసి చెరువులకు నీరు సరఫరా చేస్తే కరువును పారిపోవడం ఖాయం. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్ధాయపాలెం, నారపురెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, పుల్లాయపల్లి గ్రామాలు, పోలేపల్లి, కందులవారిపల్లి, రామాపురం, పుచ్చకాయలపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే చెరువులు, కుంటలకు నీరు సరఫరా చేయవచ్చు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా పోతుంది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. సుమారు 15 వేల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తాగునీరు కూడా సమృద్ధిగా దొరుకుతుంది. మండలంలో 36 పంచాయతీరాజ్, 11 ఇరిగేషన్ చెరువులున్నాయి. ఈ చెరువులకు ఎగువ భాగాన నుంచి నీరు వచ్చే అవకాశాలు తక్కువ ఉంది. అలా లేకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు తాము వినతి పత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపాదనలు తయారు చేయాలి



గుండ్లకమ్మ వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే సుమారు 15 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అలాగే మా గ్రామాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. స్పందించి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి.
– దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, చందవరం

బీడు భూములు సస్యశ్యామలంగా మారతాయి



లిఫ్ట్ ఇరిగేషన్ వలన బీడు పొలాలు సస్యశామలంగా పంటలు పండుతాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. రైతులు వారి గ్రామాల్లోనే వ్యవసాయ పనులు చేసుకుంటారు. దీని వలన వలసలు నివారించవచ్చు.
– బందారు రాజు, చందవరం

అదుపుతప్పి గోడను ఢీ కొట్టిన పార్సిల్ వాహనం


గోడను ఢీకొట్టిన వాహనం

ముండ్లమూరు: మద్యం మత్తులో వాహనం నడుపుతుండటంతో అదుపు తప్పి పార్సిల్ వాహనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్ సత్యనారాయణకు గాయాలయ్యాయి. కనిగిరి మండల జమ్మలమడక నుంచి విజయవాడ వెళుతున్న న్యూ విజయజానకి పార్సిల్ వాహనంలో మిరపకాయల వ్యాపారి 70 మిరపకాయ టిక్కీలను వేసుకొని అందులో బయబలు దేరారు. మార్గ మధ్యంలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మద్యం మత్తులో రోడ్డుపై బ్రిడ్జి గోడను బలంగా ఢీ కొట్టడంతో అదుపుతప్పి ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సత్యనారాయణకు గాయాలయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న మిరపకాయల వ్యాపారి త్రుటిలో తప్పించుకున్నాడు. ప్రమాద ధాటికి ప్రహరీ గోడ కుప్పకూలింది.

ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామ శివార్లలో ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పూలదండలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. జమ్మనపల్లి, కోలభీమునిపాడు, మార్కాపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

అనంత కోదండ రామునికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకొని ఆదివారం నగరంలోని సీతారామ స్వామి దేవస్థానాల్లో అభిషేకాలు అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పీవీఆర్ గరల్స్ హైస్కూల్ గడియారం వారి వీధిలో అనంత కోదండ రామస్వామి మందిరంలో, మంగమూరు రోడ్డులోని ఐశ్వర్య నగర్‌లో సీతారామ దేవస్థానంలో, గాంధీ రోడ్డులోని పిచ్చి రాముల వారి వీధిలో అనంత కోదండరామ స్వామి దేవస్థానంలో, గోపాల్ నగరం రెండో లైన్లో రామలక్ష్మణ మందిరంలో, సంత పేట 9వ లైన్లో ఉన్న సీతారామస్వామి దేవస్థానంలో, సత్యనారాయణపురం దిబ్బలరోడ్ లోని రామాలయం వీధిలోని అనంత కోదండరామ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చక స్వాములు ఉదయం ఎనిమిది గంటలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు పాలు పెరుగు తేనె చక్కెర కొబ్బరి నీళ్ల, వివిధ రకాల పండ్ల రసాలతో సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు కుంకుమ, గంధం, విభూది, చందనం పన్నీరుతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో మూలవిరాట్‌ను పుష్పాలంకరణ చేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కంప్యూటర్స్ విద్యతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

ఒంగోలు: భవిష్యత్తులో కంప్యూటర్ విద్యార్థులకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎక్సెల్ సొల్యూషన్ సీఈవో డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్స్ సంస్థలో త్వరలో ఇంజినీరింగ్‌లో చేరబోయే విద్యార్థులకు నిర్వహించిన ఫ్రీ ఏఎస్‌కే వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ వినియోగం నేడు అన్ని రంగాల్లో పెరిగిందని, దీనివల్ల కంప్యూటర్ సేవలు తప్పనిసరి అవుతాయన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సరం నుంచి నూతన ప్రోగ్రామింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సులు అభ్యసించాలని, అప్పుడే క్యాంపస్ సెలక్షన్స్‌లో జాబ్ సాధించగలుగుతామన్నారు. సీనియర్ డేటా అనలిస్ట్ బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రోగ్రామింగ్ స్కిల్స్ బాగా నేర్చుకోవాలన్నారు. అవి కష్టం అనుకోకుండా ఇష్టంగా నేర్చుకోగలిగితే పెద్ద పెద్ద కంపెనీల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగం పొందవచ్చన్నారు. నేర్చుకునే సమయంలో ఏకాగ్రత కోసం మెడిటేషన్ చేయాలన్నారు. బ్రిలియంట్ సంస్థ అధినేత డాక్టర్ న్యామతుల్లా బాషా మాట్లాడుతూ.. తమ సంస్థ విద్యార్థుల శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ డాక్టర్ తాహూరా, కోర్సు కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, మోటివేషన్ ట్రైనర్ ప్రసాద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఎదిరించాలి

- గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యం


మాట్లాడుతున్న సూర్యం తదితరులు

ఒంగోలు: రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను టీడీపీ, జనసేనలు గట్టిగా ఎదిరించాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ స్పష్టంగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలో ఎటువంటి మార్పులు జరగకుండా టీడీపీ, జనసేన అధ్యక్షులు పోరాడాలన్నారు. ప్రత్యేక హోదా, పరిశ్రమలు తీసుకురావడంతోపాటు ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకు అనుగుణంగా పార్లమెంట్‌లో చర్చ చేపట్టాలన్నారు. రాజ్యాంగం అంటే కేవలం పుస్తకం కాదని, ఏడు తరాల జ్ఞానమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ దారా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి ఉత్సవాలు


పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి


హోమంలో పాల్గొన్న భక్తులు


దర్శి: పట్టణంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేద పండితులు ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పాలపొంగళ్ళు పొంగించి అమ్మవారికి నివేదన చేశారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల ఇలవేల్పు పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూల విగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


ఎస్. కొత్తపల్లిలో ప్రత్యేక అలంకారంలో శ్రీఅభయాంజనేయ స్వామి


అలంకారంలో నాగమయ్య పుట్ట

పెద్దారవీడు: మండల పరిధిలో ఎస్. కొత్తపల్లి గ్రామంలో శ్రీ శివనాగ అభయంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం, గణపతి పూజ, తమలపాకు పూజ, కుంకుమార్చన, కలశ పూజలు అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నాగమయ్య పుట్టకు మహిళలు పాలు, పండ్లు సమర్పించి కుంకుమ, పసుపు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

దివ్యాంగుల బడిబాటే లక్ష్యం

- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు ఇంటిబాట పట్టిన అధికారులు
- ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న భవిత ఉపాధ్యాయులు


గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్న మండల విద్యాశాఖాధికారి బి.వెంకటరత్నం

కొమరోలు: దివ్యాంగ చిన్నారులు బడిబాట పట్టించే దిశగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అధికారులు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చదువుకు దూరమైన ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీల గురించి విద్యాశాఖ అధికారులు దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. వారంతా బడికి వచ్చేలా భవిత కేంద్రం ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటి సర్వే సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ చిన్నారులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిపై అవగాహన లేకపోవడంతో చాలా మంది దివ్యాంగుల తల్లిదండ్రులు వాటి ప్రయోజనాలు పొందలేక పోతున్నారు. వారికి కూడా విద్యను అందించే కేంద్రాలున్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై ఇళ్ళకే పరిమితమవుతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. పాఠశాలలు తెరిచేనాటికి వారందరినీ గుర్తించి బడుల్లో చేర్పించడమే లక్ష్యంగా అధికారులు ఇంటిబాట పట్టారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రయోజనాలు ఇలా..

- దివ్యాంగ విద్యార్థుల చదువుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు 300 రూపాయల చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తారు.
- అంగవైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరన్ ధ్రువీకరణ పత్రాలతోపాటు నెలవారి సామాజిక ఫించన్ అందేలా చర్యలు తీసుకుంటారు.
- బస్సులు, రైళ్ళలో ప్రయాణం చేయడానికి పాస్‌ల సదుపాయం కల్పిస్తారు.
- పాఠశాలలకు రాలేని వ్యక్తుల ఇళ్ళకు ఉపాధ్యాయులే వెళ్ళి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ప్రతి ఒక్కరూ చదవాలనే విద్యాశాఖ చర్యలు



ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వారి కోసం వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టింది. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న అవసరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరుస్తున్నాం. ఇప్పటివరకు మండలంలో 30 మంది విద్యార్థులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. వారంతా బడికి వచ్చే అవకాశం ఉన్నా రావడం లేదు. చిన్నారులను భవిత కేంద్రాలకు రప్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తాం.
– బి.వెంకటరత్నం, మండల విద్యాశాఖాధికారి, కొమరోలు మండలం